
బీర్కూర్ రామాలయంలో పూజలు చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి


బిచ్కుందలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార


పిట్లం రామాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ బీబీపాటిల్


కామారెడ్డిలోని రామాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి


మద్నూర్‌లో వివిధ వేషధారణలో చిన్నారులు

# ఊరూరా 'అయోధ్య' పండుగ

- బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- గ్రామాల్లో శోభాయాత్రలు
- భక్తులకు అన్నదానం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా సోమవారం శ్రీరామ నామం మార్మోగింది. ఉదయాన్నే వాకిళ్లలో కల్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేశారు. గుమ్మాలకు మామిడి ఆకులతో తోరణాలు కట్టారు. ఇండ్లలో ప్రత్యేక పూజలు చేసి దీపాలను వెలిగించారు. గ్రామాల్లో ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు పట్టారు. భక్తుల కోలాటం, నృత్యాలు, భజనలు ఆకట్టుకున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామాలయ ప్రారంభోత్సవం, బాలరాముడి ప్రాణప్రతిష్ఠను వీక్షించేందుకు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. దీంతో ప్రధాని మోదీ నిర్వహించిన కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాలను భక్తులు కనులారా వీక్షించారు. ఆలయాల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పలు గ్రామాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. పోచారం, దేశాయిపేట్ గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రత్యేక పూజలు చేశారు. బోర్లం క్యాంపు, బోర్లం, హన్మాజీపేట్, దేశాయిపేట్, కోనాపూర్, తాడ్కోల్, తిర్మలాపూర్ గ్రామాల్లో శ్రీరాముడి శోభాయాత్రను నిర్వహించారు. దేశాయిపేట్‌లో అయోధ్య కరసేవకులను గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. జుక్కల్ మండలంలోని కౌలాస్, కేమ్రాజ్ కల్లాలి, మద్నూర్‌తోపాటు మేనూర్, బిచ్కుంద రామాలయాలను ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు దర్శించుకున్నారు. జుక్కల్ మండలంలోని సావర్‌గావ్‌లో రాములోరికి గిరిజన యువతులు ప్రత్యేకంగా నైవేద్యాలు తయారు చేశారు. పిట్లం రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, బీజేపీ నాయకుడు ఆలె భాస్కర్ హాజరయ్యారు. కిష్టాపూర్ గ్రామాల్లోని ఆలయాల్లో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కామారెడ్డి పట్టణంలోని రామాలయం, భిక్కనూరులో నిర్వహించిన పూజా కార్యక్రమానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాన్సువాడలో భారీ శోభాయాత్రను నిర్వహించారు. శ్రీరామకాలనీలో ఏర్పాటు చేసిన తెరపై ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులు వీక్షించారు. వ్యాపారస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని బాన్సువాడ సీఐ మహేందర్ రెడ్డి భక్తులకు పంపిణీ చేశారు. బిచ్కుందలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార పాల్గొన్నారు.


తాండూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


జుక్కల్ మండలం బస్వాపూర్‌లో..


కామారెడ్డిలో స్వచ్ఛందంగా మూసి ఉంచిన దుకాణాలు


దేశాయిపేట్‌లో కరసేవకులను సన్మానిస్తున్న గ్రామస్తులు


బిచ్కుందలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే


బేగంపూర్‌లో ఉత్సవమూర్తుల ఊరేగింపు


భిక్కనూరులో బైక్ ర్యాలీని నిర్వహిస్తున్న భక్తులు


డోంగ్లీలో రాములోరి పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు


బాన్సువాడ పట్టణంలో కర్రసాము చేస్తున్న యువకుడు


కామారెడ్డిలో వంటలను సిద్ధం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

## ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి, జనవరి 22 : ప్రజావాణిలో వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఏవో సయ్యద్‌మసూద్ అహ్మద్, డీఆర్డీవో సాయన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం

కామారెడ్డి,జనవరి 22: నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలనేదే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో సోమవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, డీఏవో భాగ్యలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ భార్గవ్, డీఎన్‌వో, ఎస్బీఐ మేనేజర్ వినయ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

## నేడు మెగా జాబ్ మేళా

ఎల్లారెడ్డి, జనవరి 22: ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నేడు(మంగళవారం) మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ హేమచందర్ సోమవారం తెలిపారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిర్వహించే టెక్ బీ ప్రోగ్రాం కోసం 2022-24లో ఇంటర్ పూర్తిచేసే ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఓవరాల్‌గా 75శాతం, గణితంలో 60శాతం మార్కులు కలిగి, ఆండ్రాయిడ్ మొబైల్ తప్పకుండా ఉండాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

## ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష

కామారెడ్డి, జనవరి 22 : పట్టణానికి చెందిన రామచంద్రం, యాదగిరికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు శిక్ష, 200 రూపాయల జరిమానా విధించినట్లు కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండ్ క్లాస్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ప్రతాప్ వీరికి శిక్ష విధించినట్లు తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో మద్యం తాగి వాహనాలను నడపరాదని తెలిపారు.

## జిల్లాస్థాయి గణిత పోటీల్లో విద్యార్థి ప్రతిభ

సదాశివనగర్, జనవరి 22: జిల్లాస్థాయి గణిత పోటీల్లో సదాశివనగర్ మోడల్ స్కూల్ విద్యార్థి భవిత్‌కుమార్ మొదటి ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భానుమతి విద్యార్థికి సర్టిఫికెట్ అందజేశారు. విద్యార్థి భవిత్‌కుమార్‌తో పాటు గైడ్ టీచర్ దశరథ్‌ను అభినందించారు. సీహెచ్ వర్షశ్రీ, కే.కీర్తి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు అనితా శర్మ, విద్యారమణ, రాజశేఖర్‌రావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**దేవునిపల్లిలోని ఉన్నత పాఠశాలలో..**

కామారెడ్డి రూరల్, జనవరి 22 : కామారెడ్డి మండలం దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాస్, నీలం లింగం, గంగా కిషన్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రామారావు, కోశాధికారి నరేందర్, స్వప్న, సుష్మ, మమత పాల్గొన్నారు.

# 24 గంటలూ మిల్లులను నడపాలి


కలెక్టర్, అధికారులతో మాట్లాడుతున్న భారత ఆహార సంస్థ జనరల్ మేనేజర్ రాజు

కామారెడ్డి, జనవరి 22 : గత వానకాలానికి సంబంధించి పెండింగ్ ఉన్న ధాన్యాన్ని భారత ఆహార సంస్థకు అప్పగించేందుకుగాను గోదాముల్లో స్థలం కేటాయించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ భారత ఆహార సంస్థ జనరల్ మేనేజర్ రాజును కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సీఎంఆర్ జాప్యంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున జిల్లాలో ధాన్యం పెండింగ్ ఉన్న రైస్ మిల్లులు ఈ నెలాఖరులోగా తమకు కేటాయించిన లక్ష్యం మేరకు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 24 గంటలు మిల్లులను నడపాలని, లక్ష్యాలను సాధించిన మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ వారి సహకారంతో లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించామని, పలు రైస్ మిల్లులను ఆకస్మిక తనిఖీ చేస్తూ వేగవంతం చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రకాశ్‌వర్మ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజర్ శేఖర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఫలితాలు విడుదల**

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన-2023 ఫలితాలను జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సోమవారం విడుదల చేశారు. ఐదు విభాగాల్లో జూనియర్, సీనియర్ మొత్తం 165 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో ప్రదర్శించారు. ఇందులో నుంచి రాష్ట్రానికి ఐదు విభాగాల్లో జూనియర్, సీనియర్ విభాగం నుంచి ఒక్కో ప్రాజెక్టు చొప్పున ఎంపిక చేశారు. టీచర్ ఎగ్జిబిట్ నుంచి ఒకరు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ సెమినార్ నుంచి ఒక విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఆన్‌లైన్ ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థుల ప్రాజెక్టు వివరాలను ఎస్‌సీఈఆర్‌టీ వారు సూచించిన వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయిలో ప్రతిభను కనబర్చి అత్యుత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, డీఎస్‌వో సిద్ధిరాంరెడ్డి పాల్గొన్నారు.

## తాడ్వాయిలో వ్యక్తి హత్య రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం..?

ఎల్లారెడ్డి, జనవరి 22: తాడ్వాయికి చెందిన ముదాం శంకర్ ఆదివారం రాత్రి హత్యకు గురైనట్లు భార్య లక్ష్మి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్ మృతదేహాన్ని రోడ్డు పక్కన గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం ఉన్న ప్రాంతం నుంచి హత్య జరిగినట్లు అనుమానిస్తున్న స్థలం వరకు వెళ్లి పరిశీలించారు. బ్రహ్మజివాడి శివారులో హత్య జరిగి ఉంటుందని అనుమానిస్తున్నామని ఇన్‌చార్జి సీఐ తెలిపారు. మృతుడికి ఒక కూతురు ఉన్నదని తెలిపారు. కాగా.. శంకర్ రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## ఎస్పీని కలిసిన వెన్నెల

కామారెడ్డి, జనవరి 22 : హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ వారు 13 మంది సభ్యులతో కలిసి ఫిట్నెస్ మీద అవగాహన కల్పించడానికి కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు 3,890 కి.మీ. 23 రోజుల్లో సైక్లింగ్ చేశారు. ఈ 13 మంది సభ్యుల్లో కామారెడ్డి జిల్లా సాందీపని జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న బానోత్ వెన్నెల సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సింధూశర్మ, ట్రైనింగ్ ఐపీఎస్ కాజల్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.


వెన్నెలను అభినందిస్తున్న ఎస్పీ సింధూశర్మ

## పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, జనవరి 22: జుక్కల్ మండలంలోని కౌలాస్ కోటలో 26వ తేదీన గణతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాటు చేస్తున్న రహదారి పనులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సోమవారం పరిశీలించారు. ఆయన వెంట నాయకురాలు అనిత తదితరులు ఉన్నారు.

## షబ్బీర్ అలీకి నాయకుల అభినందన


షబ్బీర్ అలీని కలిసిన కాంగ్రెస్ కామారెడ్డి మండల నాయకులు

ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన మాజీ మంత్రి షబ్బీర్ అలీని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. కామారెడ్డి, మాచారెడ్డి, దోమకొండ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి పూలబొకేను అందించారు.

– కామారెడ్డి/మాచారెడ్డి/దోమకొండ, జనవరి 22

## జాగృతి పుస్తకాలు పంపిణీ


జాగృతి పుస్తకాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

పెద్దకొడప్‌గల్, జనవరి 22: అయోధ్యకాండలో బాలరాముని చరిత్ర ఉన్నందున 'శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ జాగృతి' పుస్తకాలను బేగంపూర్‌లో సోమవారం పంపిణీ చేశారు. బాల రాముని చరిత్ర తెలియాలనే ఉద్దేశంతో పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని పుట్టల అంబయ్య తెలిపారు. కార్యక్రమంలో బచ్చలి పోశయ్య, ఎల్లప్ప, ఓంకార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులు ప్రారంభం

నిజాంసాగర్, జనవరి 22: జుక్కల్ మండలంలోని నాగల్‌గావ్‌లో పోచమ్మ ఆలయ నిర్మాణ పనులను గ్రామస్తులు సోమవారం ప్రారంభించారు. విగ్రహాలు ప్రస్తుతం ఓ చెట్టు నీడన ఉంటున్నాయని, దీంతో కొత్తగా ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కపిల్ పాటిల్‌తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఈజీఎస్ తనిఖీ బృందాల పర్యటన


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సతీశ్ కుమార్

గాంధారి, జనవరి 22: మండలంలోని అన్ని గ్రామాల్లో నేటి(మంగళవారం) నుంచి ఈజీఎస్ సామాజిక బృందాలు పర్యటిస్తాయని ఎంపీడీవో సతీశ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందంతో ఆయన సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. 2022-23 వార్షిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై బృందం సభ్యులు తనిఖీలు చేపడుతారని తెలిపారు. గ్రామాల్లో సభలను నిర్వహించి చేపట్టిన పనులు, మస్టర్లలోని వివరాలు వెల్లడిస్తారని అన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో రాంనారాయణ, ఈసీ మహేశ్, ఎస్ఆర్‌పీలు రవి, పాండురంగారావుతో పాటు సామాజిక తనిఖీ బృందం సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**

స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రికన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న HIV ఎయిడ్స్ నివారణ కార్యక్రమము (టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్ట్) నిజామాబాద్ సైట్‌లో పనిచేయడానికి కౌన్సిలర్ Female ఒకరు (అర్హత: MSW/MA (Sociology) సాలరీ: 16,000 + TA 1200/-) ఒకరు GNM Female (అర్హత : GNM Pass) Salary :16000/- + TA 1200/-Out Reach Staff ఇద్దరు మహిళలు (అర్హత: ఇంటర్ పాస్) 10500+TA 1500) కావలెను. Note : HIV నివారణలో పనిచేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. అప్లికేషన్ సమర్పించడానికి చివరి తేదీ: 26-01-2024 సాయంత్రం 5-00 గం||ల వరకు
సెల్: 9885715897, 8639422001.

**CHANGE OF NAME**

★I, ARETI MALLESH (OLD NAME) H.No: 1-1,Tirmalapur,Banswada,Kamareddy,Hence Changed My Name As **ARETI MALLESHAM S/o ARETI SAILU (New Name)**
NTZ-324512

**WANTED**

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.